3. ధరఁ జీకటి కిదియే – వే – గురుఁ చుక్క ప్రభువా = సరళంబుగ యాత్రికులు నడచి – పరమపదంబును బొందఁగఁ జేయుచుఁ ॥ప్రభువా॥

– ఆల్‌ఫ్రెడ్ త్యాగరాజు పామర్

## 255 దేవుని వాక్యానందము

రా – మోహన తా – అట

సుఖ మిచ్చెగద మాకు – ప్రభుయేసువా నీ – సురుచిరమగు వాక్కు = నిఖిలకల్మష వనమునకు దవ – శిఖి శిఖలవలె గాల్చు నీదగు – ముఖవికాసిత వాక్యములు బహు – సుఖము లొసఁగు తవాశ్రితాళికి ॥సుఖ మిచ్చె॥

1. జగతిలోపల మెండుగ – నుండిన వివిధ – మగు శాస్త్రములు జూడఁగ = మిగుల గందరగోళమై మరి – యొకటి కొకటి విరుద్ధముగ మ –ర్త్యగణ కల్పిత మగుచు నున్నవి – తగని వని ద్రోచితిమి వాటిని ॥సుఖ మిచ్చె॥

2. నీ వాక్యముల భావము – నమ్మిన పాపి – జీవుల కది జీవము = కేవలం బగు ధర్మశాస్త్రము – దేవుఁ డిచ్చిన దొకటి బైబిలు – ఈ వసుధఁగల సర్వ పాపులఁ బ్రోవ వచ్చిన నిన్నుఁ జూపెను ॥సుఖ మిచ్చె॥

– పురుషోత్తము చౌదరి

## 256 దైవ వాక్యము

రా – యదుకులకాంభోజి (చాయ: ధరణిలోని ధనము లెల్ల) తా – ఆది

మమ్ముఁ బ్రేమఁ జూచి దేవుఁడు – మాకు బోధపరపఁగ = ఇమ్ముగాను లేఖనముల – నిచ్చె మాకు భూమిపై ॥మమ్ము॥

1. మా మొగంబు నద్దమందు – మేము చూచునట్లుగ = మేము గాన వచ్చు మాస్థితి – మిగులఁ దేటగ నందులో ॥మమ్ము॥

2. పాప మనెడు బురద గోతిని – బడిన మమ్ము నెత్తఁగా = పాప రహితుండైన యేసు – ప్రాణ మిచ్చెను బ్రేమచే ॥మమ్ము॥



3. పాప మంతయు వీడి మేము – భక్తి సరణిని నడువఁగఁ = ప్రాపుగాఁ దన యాత్మ నిచ్చెఁ – ప్రాణసఖుఁడగు యేసుండు ॥మమ్ము॥

4. సకల జనులు లేఖనముల – సత్యములను దెలియుచు = అకలుషముగ వానినమ్మఁగ – నంపు మాత్మను రక్షకా ॥మమ్ము॥

– జేకబ్ చేంబర్లేన్

## 257 దేవుని వాక్యము

రా – కాపి తా – ఏక

శ్రీ వినోద దాయకంబు – దేవుని వాక్యంబు – జీవమునకు నాస్పదంబు – చిరమగు ధనంబు = భావంబుల మార్చు నంబు – బహుళ సాధనంబు ॥శ్రీ॥

1. పాప తతికి నాయుధంబు – పాపి కాశ్రయంబు – భూపతులకు దుస్తరంబు –పుణ్య సాధనంబు = శాప మడంచెడు శరంబు – జగతికి విభవంబు ॥శ్రీ॥

2. స్వాతంత్ర్య మిడు దనంబు – సర్వశ్రేయంబు – ఘాతకులకు ఖడ్గంబు – నీతికినిలయంబు = ప్రీతిని గరపెడు విధంబు – ఖ్యాతికిఁ బథంబు ॥శ్రీ॥

3. సత్య విరాజితంబు – నిత్య శోభితంబు – భృత్య వరుల సంచకరము – భీతున కభయంబు = చేతో విభవంబు సుగుణ – శిష్యుల హారంబు ॥శ్రీ॥

4. కర్తఁ జూపు నద్దంబు – ఘనమహాద్భుతంబు – దురితతతికి నస్త్రంబు– దుఖశోషణంబు = పరమోపదేశంబు – బహుళమానితంబు ॥శ్రీ॥

5. సర్వజనులకును హితంబు – సౌఖ్యసాధనంబు– శాంతికి నిజమార్గంబు– జగడముల హరంబు = జగము నంతకును వరంబు – సత్యవిజయంబు ॥శ్రీ॥

6. కోలాహల కారణంబు –చాల ప్రాచీనంబు–మూలమౌ ధనంబు జగము–నేలెడి తంత్రంబు = జాలియె దన సూత్రంబు – మేలు భూషణంబు ॥శ్రీ॥

7. జ్ఞానికి దుర్ గ్రాహ్యంబు–దాని బోధనంబు–దీనజనుల కర్థంబు – దివ్య శోభితంబు = మానితభక్తిని దినంబు – మానని పఠనంబు ॥శ్రీ॥

– గున్నాబత్తుల సమూయేలు